
www.prajasakti.com

ప్రజాశక్తి

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం 5 డిసెంబర్ 2023






వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్ : తుపాన్ కారణంగా ఇందిరమ్మ కాలనీ, సుందరయ్య కాలనీల్లో నీరు చేరింది. ఈ నేపథ్యంలో వరద బాధితులకు రెడ్ క్రాస్ డిజాస్టర్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ డాక్టర్ శ్రీరంజనిలతో రెడ్ క్రాస్ ఛైర్మన్, ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెయ్యి మంది వరద బాధితులకు ఆహారం, మంచినీరు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ సంద ర్భంగా ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ఆదుకునేందుకు నెల్లూరు రెడ్ క్రాస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఉంటుందని తెలిపారు.వరదల్లో చిక్కుకున్న ఎవరికైనా సాయం కావాల్సి వస్తే రెడ్ క్రాస్ హెల్ప్ లైన్ నెంబర్ 9647 108108కు సంప్రదించాలని కోరారు.



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్సి

నెల్లూరు జలదిగ్బంధం..!



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

మిచాంగ్ తుపాన్ కారణంగా నెల్లూరు నగరం జలదిగ్బంధనంలో చిక్కుకుంది. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. జిల్లాలోని 38 మండలాల్లో పది మండలాల్లో తుపాన్ తీవ్ర ప్రభావం చూపుతోంది.సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. జిల్లా అధికారులతో మంత్రి కాకాణి సమీక్ష నిర్వహించారు. నేడు తుపాన్ ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంని కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మంగళవారం కూడా పాఠ శాలలకు సెలవు ప్రకటించారు. నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేప ట్టారు. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని కలెక్టర్ సూచించారు.

- ◆245 మి. మి వర్షపాతం
- ◆లోతట్టు ప్రాంతాలు జలమయం
- ◆నేడు తుపాన్ తీరం దాటే అవకాశం
- ◆పాఠశాలలకు సెలవు పొడిగింపు
- ◆'మిచాంగ్' ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తం



నెల్లూరులో చెరువును తలపిస్తోన్న రోడ్డు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

మిచాంగ్ తుపాన్ కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల పడుతున్నాయి. తెల్లవారు జాము నుంచి నెల్లూరు నగరంలో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన కేంద్రాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. నగరంలోని మాగుంట లే అవుట్, ముత్తుకూరు గేట్, ఆత్మకూరు బస్టాండ్ వద్దనున్న అండర్ బ్రిడ్జిలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. ఈ ప్రాంతంలో రాకపోకలను అధికారులు నిషేధించారు. ప్రజలు బయట కాలు పెట్టాలంటే ఇబ్బంది పడుతున్నారు. సోమవారం ఒక్కరోజే నెల్లూరు, నెల్లూరు రూరల్ మండలాల్లో 245 మి. మి వర్షపాతం కురిసింది. ప్రజలు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. టి గూడూరులో 162 మి.మి. ముత్తుకూరులో 156, మనుబోలులో 150, విడవలూరులో 184, వెంకటాచలంలో 181, కొడవలూరు 132, ఇందుకూరుపేట 200, కోవూరు 176 మి.మి వర్షపాతం నమోదైంది. సోమవారం ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా 65.2 మి.మి వర్షపాతం నమోదైంది తుపాన్ కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు వీచాయి. చెట్లు నేలకొరిగాయి. నేడు తుపాన్‌తీరం దాటే అవకాశమున్నందు భారీ నుంచి, అతి భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు ఎవరూ బయటకు రావద్దని కలెక్టర్ ఎం హరినారాయణన్ విజ్ఞప్తి చేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎక్కడికక్కడే ప్రాణ నష్టం జరగకుండా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్‌లో మంత్రి కాకాణి జిల్లా అధి.కారులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉదయం నుంచి కలెక్టర్, ఎస్పి, కమిషనర్ తదితర అధికారులు జిల్లా వ్యాప్తంగా పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. నగరంలోని మాగుంట లే అవుట్ ప్రాంతం నీటితో నండిపోయింది. కొత్తూరు, పడారుపల్లి, గాంధీ బొమ్మ, వెంకటేశ్వరపురం , గిరిజన కాలనీ, వైఎస్ఆర్ నగర్; బుజబుజ నెల్లూరు, కల్లుగిరి కాలనీ, ఆర్‌టిసి కాలనీ తదితర ప్రాంతాల్లో జలదిగ్బంధనంలో ఉండిపోయాయి. స్థానికులు నీటిని తోడుకునే ప్రయత్నం చేశారు. గాంధీ గిరిజన కాలనీలో సిపిఎం నాయకులు పర్యటించి ప్రజలకు ధైరం చెప్పారు. కలెక్టర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. కావలి, నెల్లూరు ప్రాంతాల్లోమూడు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృం దాలు సహాయక చర్యలు చేపట్టాయి. అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొం టున్నారు. నెల్లూరు - ఇందుకూరుపేటకు రాకపోకలను అధి కారులు నిషేధించారు. మిచాంగ్ తుపాన్ ప్రభావం నెల్లూరు నగరాన్ని అతలాకుతలం చేస్తోంది. రేపు భారీ వర్షాలు, ఈదూరు గాలులతో ప్రజలు బయటకు రావడం లేదు. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో తీవ్ర అంతరాయం ఏర్పడింది.



నెల్లూరు నగరంలో కుండపోత వర్షం



రహదారిపై నేలకొరిగిన చెట్టు

ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా ముందస్తు చర్యలు

కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రజాశక్తి -నెల్లూరు

మిచాంగ్ తుఫాను నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం లేకుండా అన్ని రకాల ముందస్తు జాగ్ర త్తలు తీసుకున్నట్లు కలెక్టర్ ఎం హరి నారాయ ణన్ తెలిపారు. సోమవారం సి ఎం క్యాంప్ కార్యా లయం నుంచి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని తీర ప్రాంత జిల్లా కలెక్టర్లతో తుఫాను ముందస్తు చర్యలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాలు నుంచి కలెక్టర్ ఎం హరి నారాయ ణన్, ఎస్ పి తిరుమలేశ్వర రెడ్డి లతో కలసి పాల్గొన్నారు. సిఎం వై ఎస్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ తుఫాను వల్ల ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా చూడటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కేవలం మనుషుల ప్రాణాలే కాకుండా పశువులు, మూగ జీవాలు రక్షణకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో ఉన్నటువంటి సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను సమర్థంగా ఉపయోగించు కొని తుఫాను నష్టాన్ని గణనీయంగా తగ్గించేం దుకు ప్రయత్నించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యం హరి నారాయ ణన్ జిల్లాలో తీసుకున్న తుఫాను ముందస్తు జాగ్ర త్తల గురించి ముఖ్యమంత్రి కి వివరించారు. జిల్లా లోని 110 కిమీ తీరప్రాంతంలో భారీ వర్షాల నేప థ్యంలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నా మన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. ఇందుకుగాను 98 సహాయ శిబిరాలను గుర్తించి, 54 సహాయ శిబిరాల్లో ఇప్పటివరకు 1991 మందిని తర లించా మన్నారు. ఇంకా 2423 మందిని తరలించుటకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. వారికి కావాల్సిన భోజన సదుపాయాలు, మంచినీటి సౌకర్యం, అందజేసి అన్ని విధాలుగా ఆదుకుంటు న్నామన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి జిల్లాలోని సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో భారీ వర్షాల వల్ల నీరు చేరుతుందన్నారు. ఇప్పటికే 2 ఎన్ డి ఆర్ ఎఫ్, 2 ఎస్ డి ఆర్ ఎఫ్ బందాలు జిల్లాకు చేరాయన్నారు. తుఫాను వల్ల జిల్లాలో ప్రాణనష్టం లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకునామన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ను అప్రమత్తం చేసి ఎప్పటి కప్పుడు సమాచారం తెప్పించుకుంటూ తదను గుణంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ కుర్మానాథ్, మున్సిపల్ కమీషనర్ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ సంజనా సింహ ఉన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని వివిధ గ్రామాల్లో మిచాంగ్ తుఫాన్ వల్ల కురిసే అధిక వర్షాలకు రబీ సీజన్లో వేసిన పంటలను మండల వ్యవసాయాధికారి వి రాము పరిశీలించారు. మండలంలోని కొండికందుకూరు, పలుకూరు, మహదేవపురం గ్రామాల్లోని పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. మినుము 760 ఎకరాలు, శనగ 825 ఎకరాలలో ప్రస్తుతం సాగు చేసి ఉన్నారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా సాధ్యమయినంతవరకు త్వరగా కాలువలు ఏర్పాటు చేసి నీరు బయటకు పంపాలన్నారు. ప్రస్తుతం మినుము పంట శాఖీయ దశ నుండి కాయ ఏర్పడు దశ నుండి,గింజ బలపడే దశలో ఉందన్నారు. వర్షాలు ఆగిన వెంటనే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.



భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-కందుకూరు : కనిగిరి రోడ్డులోని శ్రీ అయ్యప్ప స్వామి గుడి వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న భవనానికి కందుకూరుకి చెందిన మద్రిపూడి.పోతురాజు భార్య పున్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు మద్రిపూడి.శ్రీను , ప్రసాద్ అన్నప్రసాద వితరణ భవన నిర్మాణం కోసం రూ 101,116 విరాళము అందజేవారు. అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు కెఎస్.వెంకటేశ్వర్లు, ఇస్కాల.వెంకట నరసింహ ,నల్లబోతుల మురళి, ఎం వెంకటేశ్వర్లు, కె చెంచురామయ్య,దాసరి.శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి ఉన్నారు.

మురళీ మోహన్‌రాజుకు అవార్డు

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్ : యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ (యుఎస్ఎ) ఆధ్వర్యంలో సోమవారం చెన్నై టి.నగర్ లోని సోషల్ క్లబ్‌లో వివిధ రకాల ప్రముఖులు, సమాజ సేవకులకు "హ్యూమన్ ఎక్సలెన్స్ గోల్డెన్ అవార్డు" ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన రచయిత, సమాజ సేవకులు కె.మురళీ మోహన్ రాజు చేస్తున్న సేవలకు గానూ "హ్యూమన్ ఎక్సలెన్స్ గోల్డెన్ అవార్డు"ను అమెరికన్ యూనివర్సిటీ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ డాక్టర్ మధు కిషన్ చేతుల మీదుగా కె. మురళీమోహన్ రాజు అందుకున్నారు. మురళీ మోహన్‌రాజును పలువరు అభినందించార. పీస్ అంబాసిటర్ డాక్టర్ సి.హెచ్.ఉషా కిరణ్, సౌత్ ఇండియా కోఆర్డినేటర్ అద్దంకి రాజా ఉన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్ : తుపాన్ నేపథ్యంలో నెల్లూరులోని 31 వ డివిజన్లో సోమవారం చవటమిట్ట, గంగిరెడ్డుల కాలనీ,రామాలయం వీధి, ఎల్.బీ. ఎస్.నగర్ ప్రాంతాల్లో వైసిపి నాయకులు సహాయకర చర్యలు చేపట్టారు. ఆ డివిజను ఇన్‌ఛార్జి క్లస్టర్- 3 అధ్యక్షులు టి.వి.ఎస్.కమల్ ఈ పనులు చేపట్టారు. కాలువలు నిండి నీరు భారీగా రహదారులపైకి రావడంతో ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వెంటనే స్పందించిన డివిజన్ నాయకులు సహాయక చర్యలు చేపట్టారు. 31 వ డివిజన్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఏకబిగిన 48 గంటల నుంచి విద్యుత్ కోతను విధించి విని యోగదారులకు వాత పెట్టిన ట్రాన్స్ కో వైనమిది. ఈనెల 2వ తేదీ నుంచి విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. అప్రకటిత విద్యుత్ కోతలతో మండల ప్ర జలు అల్లాడిపోతున్నారు. ఎన్నడూ లేనంతగా కరెంటు కోత లు విధిస్తుండడం పట్ల విద్యు త్ వి నియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులపాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్ ఫోన్లు మూగబోయాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇన్వర్టర్లకు ఛార్జింగ్ చేసే అవ కాశం లేకుండా పోయింది. దాం తో సెల్ ఫోన్లు పని చేయలేదు. దాంతో ఫోన్ల ద్వారా జరిగే వ్యాపార లావాదేవీలు నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో తీ వ్ర అసౌకర్యంతో పాటు నష్టా లు మూట కట్టుకోవాల్సి వచ్చింది. ఏదేమైనా విద్యుత్ సరఫరా విషయంలో ట్రాన్స్ కో శాఖ అనుసరించిన నిర్లక్ష్య వైఖరి కారణంగా మండల ప్రజలు ఇబ్బందలు పడ్డారు.

పునరావాస కేంద్రాలకు మత్స్యకారుల తరలింపు

ప్రజాశక్తి-గుడ్లూరు : మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కర్లపాలెం, సాలిపేట, మూర్తి పేట గ్రామాలకు చెందిన మత్స్యకారులందరినీ అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వర్షంతోపాటు గాలులు వీస్తుండటంతో అధికారులు వాహనాల్లో మత్స్యకారులను ఎక్కించి సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. పోలీసులు,రెవెన్యూ అధికారులు పాల్గొనారు.

జాగ్రత్తలు పాటించాలి : ఇంటూరి

తుపాన్ ప్రభావం కారణంగా సోమ,మంగళవారాలలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున కందుకూరు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పలు జాగ్రత్తలు తీసుకోవాలని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వర రావు కోరారు. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లోని తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా, ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ప్రమాదంలో చిక్కుకున్నా టిడిపి కార్యాలయం ఫోన్ నెంబర్ 7416849333 నెంబర్‌కు చేయాలని సూచించారు.

సాగునీటి పంపిణీపై మంత్రి 'కాకాణి' సమీక్ష

ప్రజాశక్తి -నెల్లూరు

వర్షాలు పుష్కలంగా కురుస్తున్నందున రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసు కుంటు న్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున సోమశిల, కండలేరు, సంగం, నెల్లూరు పెన్నా బ్యారేజీలలో నీటి నిల్వల, రైతులకు సాగునీరు విడుదలపై సోమవారం ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి జలవనరుల శాఖ అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నెల్లూరు, సంగం బ్యారేజీలలో సర్‌ప్లస్ వాటర్‌ను కనుపూరు కాలువ ఆయకట్టుకు రెండు టిఎంసిల విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి గోవర్ధన్ రెడ్డి, ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన సాగునీటి సలహామండలి సమావేశంలో 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం సంగం, నెల్లూరు బ్యారేజ్ లో ఉన్న సర్ ప్లస్ వాటర్ ను కనుపూరు కాలువ ఆయకట్టు రైతులకు రెండు టీఎంసీలు నీటిని అందించేందుకు అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వర్షాలు పుష్కలంగా కురు స్తున్నందున జిల్లాలోని అన్ని చెరువులు కూడా నీటితో కళకళలాడు తున్నాయని, సాగునీటికి ఢోకా లేదని వారు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి

గాంధీ గిరిజన కాలనీ జలమయం

స్థానికులకు ధైర్యం చెప్పిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -నెల్లూరు

నగర నియోజకవర్గ పరిధిలోని 53వ డివిజన్‌లోని గాంధీ గిరిజన కాలనీలోని శివారు ప్రాంతం తుపాన్ కారణంగా నీటమునిగింది. అనేక ఇల్లు జలమయమయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న స్థానిక సిపిఎం నాయకులు గాంధీ గిరిజన కాలనీలో పర్యటించి కమిషనర్ దష్టికి పరిస్థితిని తీసుకువెళ్లింది. ఈసందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసిన ప్రతి సందర్భంలో ఈ ప్రాంతం జలమయం అవుతుందన్నారు. నిరుపేదల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించ డం సరికాదన్నారు. గత వరదల నేపథ్యంలో దెబ్బ తిన్న రహదారులను ఇంతవరకు బాగు చేయలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల న్నారు. నిరుపేదలు, భిక్షాటన ఎత్తుకొని జీవనం సాగించే అతి సామాన్యుల పట్ల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వం, అధికారులు వ్యవహరించడం బాధాక రమన్నారు. జలమయమయమైన ప్రతి సందర్భంలో ఒక చిన్న పాటి ఇంజిన్ పెట్టడం, నాలుగు ఆహార పొట్లాలు పంచడం పరిపాటిగా మారిం దన్నారు. శాశ్వత పరిష్కారంగా పెన్నా నది అవుట్ లెట్ వద్దకు ఈ ప్రాంతం నుండి డ్రైన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తుపాన్ ప్రమాదం నుండి బాధితులను ఆదుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కె.ఈశ్వరయ్య,సిద్ధార్థ, పెంచలయ్య చిరంజీవి ఉన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న సిపిఎం నాయకులు

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో 'ఇంటూరి' పర్యటన

ప్రజాశక్తి-కందుకూరు

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పర్యటించారు. ఉలవపాడు మండలంలో పలు గ్రామాల్లోని తపాన్ షెల్టర్లకు వెళ్లి, బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అక్కడ కల్పిస్తున్న వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలను బాధితులకు అందజేశారు.ముందుగా మన్నేటికోట పంచాయతీ పరిధిలోని జివిఆర్ ఎస్టి కాలనీలో నాగేశ్వరరావు పర్యటించారు. ఉలవపాడులోని కోటిరెడ్డి గుంట కాలనీలో, అక్కడివారు పడుతున్న బాధలను చూసి నాగేశ్వరరావు చలించిపోయారు. ఇళ్లచుట్టూ వరదనీరు చేరు కున్నప్పటికీ, వారంతా అక్కడే ఉండడాన్ని గమనించి ప్రశ్నించారు.పక్కనే ఉన్న ఎంపిడిఒ కార్యాలయంలో తమను తలదాచుకోవాలని అధికారులు చెప్పారని, అయితే కాలనీలోని 80 మందికి అక్కడ చోటు సరిపోవటం లేదని బాధితులు తెలిపారు. దీంతో నాగేశ్వరరావు అక్కడ నుంచే అధికారులతో మాట్లాడి, కాలనీ వాసులను మరో సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు.

బాలకోటయ్య సంఘంలో... : కరేడు పంచాయతీలోని బాలకోటయ్య సంఘం వద్ద పునరావాస కేంద్రానికి నాగేశ్వరరావు వెళ్లారు. బాలకోటయ్య సంఘం, మద్రిచెట్టు సంఘం, వాక ప్రాంతాల్లోని సుమారు 250 మంది ఆశ్రయం పొందుతుండగా వారందరితోనూ నాగేశ్వరరావు మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పార్టీ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, అంచుపోగు వాసు, తొట్టెంపూడి మాల్యాద్రి, మల్లవరపు వెంకటరావు, కత్తి శివ, శ్రీను, చిమ్మిరి మోహన్ రావు, గొత్తుల జనార్ధన్, రాచగర్ల శివ తదితరులు నాగేశ్వరరావు వెంట ఉన్నారు.





ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద కెవిపిఎస్ నాయకులు

దళితుల సమస్యలు పరిష్కరించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -నెల్లూరు : ఢిల్లీలోని జంతర్ మంతర్ సెంటర్లో సోమవారం జరిగిన చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లాకు చెందిన కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.దళితుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, జస్టిస్ పున్నయ్య సిఫార్సుల అమలు కోసం, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ సెంటర్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లాకు చెందిన కెవిపిఎస్ నాయకులు ఆలూరు తిరుపాలు, ఆత్మకూరు నాగయ్య పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : మహీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కందుకూరు : తుపాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి సూచించారు. పూరి గుడిసెలలో నివసించేవారు అధికారులు సూచించిన భవనాల్లోకి వెళ్లాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుపాన్ ప్రాంతాలకు నిధులు విడుదల చేశారని, ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని అధ్యయనం చేస్తున్నారని ఆయన అన్నారు. వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు..వైసిపి నాయకులు, కార్యకర్తలు తుపాన్ ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

పునరావాస కేంద్రాలలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరి పురపాలక సంఘంలో తుఫాను సహాయక చర్యల్లో భాగంగా పట్టణంలో ప్రధాన డ్రెయిన్లకు సంబంధించి మాచవరం రోడ్డు వైపు, చుట్టుగుంట రోడ్డు వైపు ,క్లబ్ రోడ్డు ఉన్న ప్రధాన డ్రై న్ లో పూడికను కమిషనర్ మనోహర్ దగ్గ రుండి తీయించారు. ఉప్పు చెరువు లోతట్టు ప్రాంతం, జనార్ధన కాలనీలోని పుట్ట ఏరియా కాంపౌండ్ వద్ద,అనుకున్న గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలను వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.ఎఎంసీఎంసీ మార్కెట్ యార్డులో వారికి బస కల్పించి అక్కడే భోజన ఏర్పాట్లు చేయించారు. తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న దష్ట్యా ప్రజలు ఎటువంటి సమస్య ఉన్నా 9177700268 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఉలవపాడు : ఉలవపాడు మండల పరిధిలో మిచాంగ్ తుఫాను ప్రభావంతో ఏర్పడిన భారీ వర్షాలకు ముంపు ప్రాంతాలు తీరప్రాంతాల పునరాసవ కేంద్రాలను సోమవారం నెల్లూరు జిల్లా జాయిట్ కలెక్టర్ కూర్మానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చాకిచెర్ల పంచాయతీలోని తుఫాన్ షెల్టర్ కరేడు పంచాయతీలోని తుఫాన్ షెల్టర్లలో ఉన్న ముప్పు గ్రామాల పునావరాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. తహశీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో కాంగ్రెస్ నేత సురేష్‌బాబు

ప్రజాశక్తి - కావలి:జిల్లాలో గతనాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌పార్టీలో విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ,ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీలో పి.సి.సి. సభ్యులుగా,రాష్ట్రఅధికార ప్రతినిధిగా ఉంటూ తనదైన శైలిలో పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలూ పాటు పడుతున్నారు లేళ్ళపల్లి సురేష్‌బాబు.దళితుడై పుట్టినా,కూడా వెనుకంజవేయలేదు.



పార్టీలో కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డికి ప్రియశిష్యులుగా కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా, ప్రస్తుత జిల్లా కాంగ్రెస్ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డికి అనుగు సహచరుడిగా సురేష్ గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ ప్రయాణం పరిశీలిస్తే,కాంగ్రెస్‌వాది,లేళ్ళపల్లి కనకరాజుకు 1960మార్చి 14 వతేదీన పుట్టిన సురేష్ తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. 1977లో ఆయన ఎన్ఎస్‌యుఐజిల్లా కార్యదర్శిగా ఎన్నికై,1978 వరకు పనిచేశారు.1978నుండి 1981 వరకు కావలి తాలూకా యూత్ కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 1989లో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.1991నుండి 2003వరకు 12సంవత్సరాలపాటు నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌పార్టీ సేవాదళ్ అధ్యక్షులుగా పనిచేశారు. 2001నుండి 2015 వరకు నెల్లూరు జిల్లా కావలి తాలూకా విశ్వనాథరావుపేట మేజర్‌గ్రామపంచాయతి సర్పంచ్‌గా పనిచేశారు. 2015నుండి 2020 వరకు పి.సి.సి.సభ్యులుగా ఉన్నారు. 2021నుండి ప్రస్తుతం వరకు పి.సి.సి.సభ్యులుగా, అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. తెలంగాణా రాష్ట్రంలో, కర్నాటక రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వాలు గెలవటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు .ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని లేళ్ళపల్లి సురేష్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-వరికుంటపాడు:రక్తదానం ప్రాణదానం చేయడమేనని రక్తం లేక ఏ ఒక్కరూ మరణం చెందకూడదనే సంకల్పంతో పచ్చవ వెంకయ్య తన తండ్రి ప్రథమ వర్ధంతిని రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారంమండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామ పచ్చవ లక్ష్మయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్ క్రాస్ సహకారంతో గ్రామస్తులు చుట్టుపక్కల పరిసర గ్రామస్తులు 51 మంది రక్తదానం చేశారు.



ఈయన సొంత గ్రామానికి పలు అభివృద్ధి కార్యక్రమాలు ఇలాంటి రక్త దాన కార్యక్రమాలు చేపట్టడంపై గ్రామస్తులు పలువురు ఆయనను అభినందించారు. బ్లడ్ డొనేట్ చేసిన దాతలకు పౌష్టికాహారమైన జ్యూస్, ఖర్జూరం, కోడిగుడ్లు, భోజన ఏర్పాట్లు చేశారు. ముందుగా పచ్చవ లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి ఆయనను స్మరించుకున్నారు.కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అలీ అహ్మద్, బొల్లా మల్లి, మునులయ్య, జన విజ్ఞాన వేదిక యడవల్లి వెంకట సుబ్బయ్య, నాదెళ్ల రమణయ్య, పి. మాల్యా చలం, చెన్న కేశవులు, డి వి.రమణయ్య, పాపారావు మానవతా సంస్థ పాలక తిరుపతిరెడ్డి, వెండిండి వెంకటేశ్వర రెడ్డి ,వై వెంకటసుబ్బయ్య ,ముక్కు తిరుపతిరెడ్డి ,పాల్గొన్నారు.

తుపాన్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి-మర్రిపాడు:మిచాంగ్ తుపాన్ ప్రభావం వల్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఆనందరావు తెలియజేశారు. వాతావరణ శాఖ వారి సమాచారంతో తీవ్ర తుపాన్ వల్ల ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉంటాయని హెచ్చరించడంతో తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగిన సమాచారం అందించాలని కోరారు. మండల వ్యాప్తంగా రెవెన్యూ సిబ్బందిని ఆయా గ్రామాలలో తుపాన్ ప్రభావం వల్ల ఇబ్బందులు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకునేందుకు నియమించామన్నారు.భారీ వర్షాలతో చుంచులూరు, పడమటినాయుడుపల్లి వద్ద కేతామన్నేరు వాగు, సన్నువారిపల్లి వద్ద బొగ్గేరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలు, ప్రజలు రవాణా జరుపరాదనీ ప్రజలను హెచ్చరించారు.

గుంతలమయంగా రహదారులు

ప్రజాశక్తి-అనంతసాగరం:మండలం నుంచి సోమశిల వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారింది.గతుకులు గుంతలు ఏర్పడ్డ రహదారిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తుందని వాహనదారులు వాపోతు న్నారు.ఏళ్లతరబడి సమస్యను ఎదుర్కొంటున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించు కోలే దన్నారు. తారు రోడ్డు మట్టి రోడ్లలా దర్శన మిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణిస్తుంటే వెన్నునొప్పులు వస్తు న్నాయని అంటున్నారు. సోమశిల ఇసుక రీచ్ నుండి వాహనాలు



గుంతలమయంగా ఉన్న రోడ్డు

ప్రతినిత్యం అధిక లోడుతో రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు పై మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డా మరమ్మతులు చేపట్టడంలేదు. రహదారిపై ప్రయాణం కష్టంగా మారిందని వాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతుండడంతో గుంతలు నీటితో నిండి గుంతలు ఉన్నాయో లేవో తెలియక వాహనదారులు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు.నాలుగు కిలోమీటర్లు ప్రయానించాలంటేనే గంట సమయం పడుతుంది.వెంటనే అధికారులు రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహన దారులు కోరారు.



తీర ప్రాంతాల్లో పర్యటించిన పసుపులేటి

ప్రజాశక్తి-బిట్రగుంట

తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో పసుపులేటి వెంకటేశ్వర్లు మండలంలోని జువ్వలదిన్నె తాటి చెట్ల పాలెం బంగారు పాలెం తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించారు. మత్స్యకారులతో మాట్లాడారు. భారీ వర్షం వస్తుండడంతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంత గ్రామాలైన పర్యటించారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా పసుపులేటి చారిటబుల్ ట్రస్ట్ దష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా పసుపులేటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారీ వర్షం నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. మత్స్యకారులు తమ బోట్లను వలలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించామని. గ్రామాల్లో అవసరమైతే తుఫాన్ షెల్టర్ కేంద్రాలకు వెళ్లాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు పసుపులేటి సుధాకర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యూష పసుపులేటి సుధాకర్ అభిమానులు పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అప్రమత్తంగా ఉండాలి.

ప్రజాశక్తి-బిట్రగుంట

తుపాన్ ప్రభావంతో కురుస్తూ,గాలులు వీస్తునందున సముద్ర తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండి తుఫాన్ తీవ్రత తగ్గే వరకు సురక్షిత ప్రాంతాలకు చేరాలని కావలి డిఎస్పి ఎం వెంకటరమణ సూచించారు. బోగోలు మండలం లోని జువ్వలదిన్నె హార్బర్ ను తాటిచెట్ల పాలెం లోని మత్స్యకారులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.భారీ వర్షం,గాలులు వీస్తున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతానికి, సైక్లోన్ షెల్టర్లు కు ,ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని,ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు. ఆయనతో బిట్రగుంట ఎస్సై శేఖర్ బాబు, ఏఎస్ఐ ప్రభాకర్ రెడ్డి ,సిబ్బంది తదితరులు ఉన్నారు.

హాస్టల్ ఎదుట ఎస్ఎఫ్ఐ నిరసన

- మెరుగైన వస్తువులు కల్పించాలని
- దోమలతో అవస్థలు ఎదుర్కొంటున్న విద్యార్థులు

– ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులు పడుతున్న తీవ్ర ఇబ్బందులను, పరిష్కారం కానీ సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ బీసీ హాస్టల్ ఎదుట బైఠాయించి ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు నిరసన తెలిపారు..విద్యార్థులకు తగిన విధంగా కనీసం మౌలిక వసతులు లేకుండా తుపాన్ కారణంగా గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రేకుల షెడ్డులో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పడుతున్నారని పటిష్టమైన భవనంలోకి వీరిని చేర్చి వారికి కనీస వసతి కల్పించాలంటూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు హాస్టల్ లోని ఇబ్బందులను విద్యార్థులను అడిగి తెలుసుకుని అనంతరం హాస్టల్ వార్డెన్ కు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి త్వరితగతిన వారి సమస్యను పరిష్కరించాలన్నారు గత కొన్ని ఏళ్లుగా అధికారులకు తమ ఇబ్బందులను తెలియపరిచిన పరిష్కారం చేయలేదని రేకుల షెడ్డులో ఉన్న ఈ హాస్టల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు ఆవేదన వెళ్ళబుచ్చారు. హాస్టల్ పరిధిలోకి పందులు సంచరిస్తున్నాయని . అప్పుడప్పుడు పాములు కూడా వస్తాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు . హాస్టల్ కు ఎదురుగా ఉన్న మురికి కాలువ వలన దోమల అధికంగా ఉన్నాయని 70 మంది విద్యార్థులకు గాను ఒకే ఒక బాత్రూమ్ ఉందని తెలియజేశారు. హాస్టల్ చుట్టూ అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులు రోగాలను బారిన పడే అవకాశాలు ఉన్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్భంగా తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల పడుతున్న బాధలను గమనించి సమస్యలు పరిష్కరించకపోతే తమ నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగిస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ కన్వీనర్ ఖాదర్ భాష, కో కన్వీనర్ చక్రి, సభ్యులు కార్తీక్, నాని తదితరులు పాల్గొన్నారు..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కావలి

తుపాను కారణంగా భారీ వర్షాలు,తీవ్రమైన ఈదురు గాలులు వీస్తున్నందున బుధవారం సాయంత్రం వరకు ప్రజలు బయటకు రావద్దని, అత్యవసర మైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ ఎం. హరినారాయణన్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.సోమవారం సాయంత్రం అయన కావలి ఆర్. డి. ఓ. కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తీం ప్రాంత ప్రజలు,పూరి గుడిసెల్లో వుండే వారు సురక్షిత ప్రదేశాలలో వుండాలని కలెక్టంతెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికీ మంచి భోజనాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలను రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలను తరలించే సమయం లోఅధికారులకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అయనతోపాటు ఆర్. డి. ఓ. వి. కే. శీనా నాయక్, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రామమూర్తి పేట లోని మున్సిపల్ స్కూల్ ను పరిశీలించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



మాటాల్లడుతున్న అధికారులు

గంజాయి అక్రమ రవాణా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి: ఆర్టిసి డిపో గ్యారేజీలో డ్రైవర్లకు కండక్టర్లకు సిఐ వి గిరిబాబు, కోవూరు సెబ్ సిఐ నరహరి లు గంజాయి అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ లో డ్రైవర్లకు కండక్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ సహకారంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని పట్టుకొని అడ్డుకట్ట వెయొచ్చన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తుంటే వారిపై దష్టి సాధించి సంబంధిత శాఖలకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. అలాగే నిషేధిత గంజాయి ఎవరైనా విక్రయిస్తే వారి సమాచారాన్ని తెలపాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు మీ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు.



నారుమళ్లను పరిశీలిస్తున్న అధికారి

పంట దెబ్బతినకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాలలోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని , ఆత్మకూరు సహాయ సంచాలకులు వి. దేవసేనమ్మ సూచించారు. మండలంలోని వాసిలి, బట్టేపాడు , అప్పారావుపాలెం, బోయల చిరువెల్ల , గ్రామాలలో వరి నాట్లు జరుగుతున్నాయని వరి నారుమళు వీటిలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కాలువలు ద్వారా బయటకి పట్టించుకోవాలని , లేదంటే నారు లేదా నాటిన వరి దెబ్బతినే అవకాశం ఉందని సూచించారు . చాలా ప్రాంతాలలో పొగాకు నాటినందున వీటిలో కూడా నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా బయటకు పంపుకోవాలని , వరి పొగాకు నాట్లు వర్షాలు తగ్గిన తర్వాత వేసుకోవాలి. వర్షం తగ్గిన వెంటనే నాటిన పొగాకు పంటలో కార్బెండ్ జోమ్ తెగుళ్ల మందును లీటర్ నీటికి 3గ్రా చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈరోజు వాసిలి , ఆత్మకూరు, నెల్లూరు పాలెం, గ్రామాలలోని నాటిన వరి, పొగాకు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కిషోర్ బాబు , రైతులు పాల్గొన్నారు.

తుపాన్ పై పలు సూచనలు

ప్రజాశక్తి-సంగం

తుపాన్‌పై ట్రాన్స్‌కో ఎఇ పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గాలులకు ఇప్పటికే పలు ప్రాంతాలో పడిపోయిన విద్యుత్ స్తంభాలను,తీగలను తమ సిబ్బంది మరమ్మతులు చేశారన్నారు.విద్యుత్ శాఖ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి స్తంభాలను ,విద్యుత్ తీగలను మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.ప్రజలు తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో కరెంట్ స్తంభాలను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.గ్రామాల్లో ఎటువంటి సమస్య ఉన్న వెంటనే తమ కాల్ సెంటర్లకు కానీ తమ సబ్ స్టేషన్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసులు రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: నైరుతి బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన మిగ్‌జామ్ తుఫాను కారణంగా ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని. ఆత్మకూరు ఆర్డీవో కే మధులత అన్నారు. సోమవారం మండలంలోని కరటంపాడు ఎస్టీ కాలనీలో గిరిజన కాలనీను సందర్శించారు. అక్కడ ఉన్న 70 మంది గిరిజ నులను పునరావాస కేంద్రమైన అంగన్వాడి భవ నానికి తరలించారు. వారికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అదిలంతా అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



జొన్నవాడలో రుద్రాభిషేకం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

:శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం పర్వదినమున రోజున ఉదయం స్వామివారికి మహాన్యాస రుద్రాభిషేకాలు. అమ్మ వారికీ నవవర్ణ పూజలు. గణపతి స్వామి కి సుబ్రహ్మణ్యం స్వామి కి అభిషేకలు పూజ కార్యక్రమాలు జరిగాయి. అమ్మ వారికీ ఉదయం అభిషేక కార్యక్రమం తో పాటుశ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మ వారి మహా రుద్రహోమం ఎంతో వైభవం గా శోభయమనం గా జరిగింది ఈ పూజ కార్యక్రమం లో దేవస్థానం ఛైర్మెన్ పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు, లక్ష్మి కాంతమ్మ, ఆలయ కార్య నిర్వహణ అధికారి విరుపావర్ఘుల గిరికష్ణ, ఆలయధర్మ మండలి సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పూజలలో పాల్గొన్నారు భక్తులు పాల్గొని స్వామి అమ్మ వార్ల తీర్ద ప్రసాదాలు స్వీకరించారు.



పరిశ్రమల పునరుద్ధరణ కోసం రాజ్యసభలో ప్రశ్నించిన బీద మస్తాన్ రావు

ప్రజాశక్తి–కావలి.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా సోమవారం రాజ్యసభలో సాంప్రదాయ పరిశ్రమల పునరుద్ధరణ కోసం కేటాయించిన నిధుల స్కీంపై తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసినదిగా బీద మస్తాన్ రావు కోరారు. సాంప్రదాయ పరిశ్రమలు పున రుద్ధరణ కోసం నిధుల పథకం కింద గత ఐదుసంవత్సరాలలో రాష్ట్రాల వారీగా ఏర్పడిన క్లస్టర్ల వివరాలుగురించిఅడిగారు.గత ఐదేళ్లలో స్ఫూర్తి పథకం కింద కేటాయించినమరియువిడుదల చేసిన నిధుల వివరాలు తెలపాలన్నారు.ఆంధ్రప్రదేశ్,రాష్ట్రంలో ప్రభుత్వం అదనపుక్లస్టర్లను గుర్తించిందా? మరియుఅలా అయితే, దాని వివరాలు ఇవ్వాలని కోరారు.సూక్ష్మ, చిన్న మధ్య తరగతి ఎంటర్ప్రైజెస్ మంత్రిత్వ శాఖలో రాష్ట్ర మంత్రి భాను ప్రతాప్ సింగ్ వర్మ బీదప్రశ్న లకు సమాధానం ఇస్తూసాంప్ర దాయ పరిశ్రమలుపునరుద్ధరణ కోసం నిధుల పథకం (స్ఫూర్తి) కింద గత ఐదుసంవత్సరాలలో 28 రాష్ట్రాలలో 429 క్లస్టర్లు మంజూరు చేశామని, కానీ 2022–23వ సంవత్సరంలో కొత్తక్లస్టర్లుమంజూరుచేయలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు గడిచిన 5 సంవత్సరములలో 13 క్లస్టర్లు మంజూరు చేశామని తెలిపారు.గత5సంవత్సరాలలో స్ఫూర్తి కింద 1218 కోట్లు కేటాయించగా, 991 కోట్లు విడుదల చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్,రాష్ట్రంనుంచి ఎలాంటి కొత్త క్లస్టర్లు ఏర్పాటుకు ప్రతిపాదన ఎం.ఎస్.ఎం.ఇ మంత్రిత్వ శాఖ పరిశీలన కోసం ఇప్పటి వరకు రాలేదనిమంత్రివ ర్యులుభాను ప్రతాప్ సింగ్ వర్మ తెలిపారు.



మాట్లాడుతున్న అధికారి

పంటలపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కొడవలూరు

వరిరబీ పంటను నారుమడి దశలో విత్తిన 2–3 రోజుల వయస్సులో మూడు రోజులకు మించి నీటిలో మునిగినప్పుడు, మొలకెత్తే శాతం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఈ దశలో మొలకెత్తడానికి నీటిని పూర్తిగా తొలగించాలి. సాధ్యం కాకపోతే మొలకశాతం తగ్గుతుంది కనుక తిరిగి విత్తడం మంచిది. నారుమడిలో నారు వయస్సు 7–30 రోజులు అయి ఉన్నట్లయితే 5 రోజులకు మించి నీట మునిగినట్లయితే నారుమడి దెబ్బతినే అవకాశం ఉంది. అందువలన వీలైనంత త్వరగా నీటిని పూర్తిగా తీసివేసి, పంటను గాలికి బహిర్గతం చేయాలి. పొలాల నుండి నీటిని తీసివేసిన తర్వాత ప్రతి 5 సెంట్ల నారుమడికి 1 కేజీ యూరియా 1 కేజీ ఎం ఓ పి వేసినట్లయితే త్వరగా కొత్త ఆకులు వచ్చేదానికి అవకాశం ఉంటుంది. అలాగే మొక్కలు త్వరగా కోలుకొనుటకు నీరు తీసిన వెంటనే 1 గ్రా కార్బండిజమ్ లేదా 2 గ్రాముల కార్బండిజమ్ మాంకోజెబ్ మిశ్రమాన్ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నాటిన పొలంలో నీరు అధికంగా ఉన్నట్లయితే వీటిని పూర్తిగా తీసివేసి ఎకరాకు 20 కేజీ యూరియా 20 కేజీ ఎం ఓ పి వేయాలి. యొక్క త్వరగా కోలుకొనుటకు 1 గ్రా కార్బండిజమ్ 1 లీ నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే శిలీంద్రాలు (ఫంగస్) ద్వారా వచ్చేవ్యాధుల నుండి పంటను కాపాడుకోవచ్చును. కార్యక్రమంలో ఏఓ సిహెచ్ లక్ష్మి విఏఏలు

రెడ్‌క్రాస్ భవనంలో హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి-కావలి

కావలి ఆర్డీఓ వి.కె.శీనానాయక్ ఆదేశాల మేరకు కావలి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సోమవారం పలుతు పాన్ ఉపశమన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెడ్ క్రాస్ భవనంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసి, రెస్క్యూ శిక్షణ పొందిన సోషల్,ఎమర్జెన్సీ రిలీఫ్ వాలంటీర్స్ బందాలను అందుబాటులో ఉంచారు. ఈ బందాలు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలకు సహకరిస్తాయి. రామమూర్తిపేట పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తుఫాన్ నిర్వాసితుల శిబిరంతో పాటు, ఆర్టీసీ బస్టాండ్, ఇతర ప్రాంతాలలో 200 ఆహారపొట్లాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాలను ఆర్డీఓ సోమవారం సమీక్షించారు. ఆయన సూచనల మేరకు అత్యవసర వైద్య బందాన్ని కూడా సిద్ధపరిచారు. కార్యక్రమాలలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, కార్యదర్శి గంధం ప్రసన్నాంజ నేయులు, కోశాధికారి కలికి శ్రీహరి రెడ్డి, హరినారపరెడ్డి, సెర్వ్ బందసభ్యులు నయీమ్, రాజశేఖర్,బాలాజీ,సాయికుమార్, మున్సిపల్ డిఇ సాయిరాం, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాబురావు, శాంతినగర్ వార్డ్ సచివాలయ కార్యదర్శి రమేష్,పరశు మురళి తదితరులుపాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

150 మందికి భోజన వసతి ఏర్పాటు
పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని మోడల్ ఎస్టీ కాలనీ చెరువు కట్టను ఆనుకుని ఉండడంతో తుపాను వర్షాలతో వారందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ సూచించారు.సోమవారం మోడల్ ఎస్టీ కాలనీని సందర్శించి కాలనీవాసులతో మాట్లాడారు. పూరిగుడిసెల్లో నివాసముండే వారు వర్షాలతో వండుకునే సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే 150 మందికి భోజన వసతి కల్పించారు. రాత్రికి కూడా భోజనం అందచేస్తామని ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదంటూ వారికి తెలిపారు. వర్షాలు అధికంగా కురిసి కాలనీలో నీళ్లు చేరితే పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండాలని, అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు.



మిచౌంగ్ బాధితులకు కాకర్ల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉదయగిరి

మిచౌంగ్ తుపాను తో బాధపడే వారు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కాకర్ల సురేష్ ను తక్షణ ఆర్థిక సహాయం కోసం కోరాలన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 8 మండలాలలో తుఫాను వల్ల ఏమైనా ఇబ్బందులు ఎదురైన సందర్భంలో తమ వంతు సాయం అందించుటకు వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసామన్నారు. కావున తక్షణ ఆర్థిక సహాయం కొరకు ఈ క్రింది నెంబర్ల కు 94089 90899,76740 08870సంప్రదించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుండి బయటికి రావాలని నియోజకవర్గ ప్రజలు విద్యార్థులు యువత కురుస్తున్న వర్షాలను దష్ట్యాలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కేతిగుంటలో పేదలకు, వద్దులకు గ్రామ సర్పంచ్ నాగేళ్ల హరితేజ సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తుపాన్ ప్రభావం దష్ట్యా తీవ్రంగా చలి గాలులు వీస్తుండడంతో సర్పంచ్ తమ సొంత నిధులు వెచ్చించి పేదలకు వద్దులకు పంపిణీ చేశారు. యువకుడు, విద్యావంతుడు అయిన ఆయన సామాజిక స్పహ కలిగి తన పంచాయతీలో ఆపదలో ఉన్న అందరికీ అండగా ఉంటా చేయుతనిస్తుంటారు. తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు ఈదురు గాలులు వీస్తున్నందున బయటకు రాకుండా అందరూ ఇళ్ల వద్దనే ఉండాలన్నారు. పంచాయతీలో పేదలకు వద్దులకు దుప్పట్లు పంపిణీ చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి కతజ్ఞతలు తెలియజేశారు.



దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

అధికారులు సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-సంగం

: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో మండలంలో అధికారులు సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో లోతట్టు ప్రాంతమైన కోలగట్ల గ్రామంలో తహశీల్దార్ నాగరాజు,ఎస్ఐ నాగార్జున రెడ్డి పర్యటించారు.గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలను పరిశీలించి.. ప్రజలకు తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని వారికి సూచించారు. సంఘం మండలం అన్నారెడ్డి పాలెం ఎస్టీ కాలనీ ను ఎంపీడీవో గోపి సందర్శించారు. కాలనీలో ఉన్న 15 ఎస్టీ కుటుంబాలకు తుపాన్ పట్ల అవగాహన కల్పించి స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా అప్పనరావు సి కేంద్రంలో ఎస్టీ కుటుంబాలకు అన్ని వసతులు ఏర్పాటు చేశారు.